డిబేట్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని మంగళవారం గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీవాణి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జరిగిన డిబేట్ పోటీలలో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని జి.ధనలక్ష్మి 'సేవ్ గర్ల్' అనే అంశంలో ప్రథమ స్థానం సాధించిందని, కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి చేతుల మీదుగా ప్రశంస పత్రం, మెమోంటోతో పాటు రూ.5 వేల నగదు బహుమతి అందుకుందని చెప్పారు. విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

కోల్డ్ స్టోరేజీ పరిశీలన

తాడేపల్లిరూరల్ : గుంటూరు జిల్లా దుగ్గిరాలలో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌ను మంగళవారం రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు పరిశీలించి సబ్ కలెక్టర్‌కు రిప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదానికి గురైన కోల్డ్ స్టోరేజ్‌ను పరిశీలించామన్నారు. రైతులతో మార్కెట్ యార్డ్ వద్ద జరిగిన సమావేశంలో నష్ట పోయిన పసుపు రైతులకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం క్వింటాకు రూ.11,850లు నష్ట పరిహారం ఇవ్వాలని, కోల్డ్ స్టోరేజ్ అద్దెను, ఇన్సూరెన్స్ సొమ్ము, దానిమీద వడ్డీలు రద్దు చేయాలని కోరామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, కోల్డ్ స్టోరేజ్ బాధితుల కమిటీ కన్వీనర్ వేముపల్లి వెంకటరామయ్య, మొలకా శివసాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమ ఫలాలు..జీవితాల్లో కొత్త వెలుగులు

- ఆర్థిక స్వావలంబన దిశగా మహిళల ముందడుగు
- పింఛన్ పెంపుతో అవ్వాతాతలకు భరోసా
- ఉన్నత విద్యావంతులుగా మారుతున్న గ్రామీణ యువత

మంగళగిరి: వైఎస్సార్ చేయూత, ఆసరా వంటి ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలు తమ జీవితాలలో వెలుగులు నింపాయని అక్కచెల్లెమ్మలు, అవ్వా తాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు మోసపూరిత పాలనలో ఆర్భాటపు ప్రచారాలు తప్పా ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. రుణమాఫీ అంటూ మాయ మాటలలో మోసపోయిన మహిళలు నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నామని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ ఆసరా నాలుగు దఫాలుగా క్రమం తప్పకుండా అనుకున్న సమయానికి బ్యాంకు ఖాతాలలో జమ అవుతుండడం, సున్నా వడ్డీ రుణాలు పొందుతున్న మహిళలు వివిధ వ్యాపారాలు నిర్వహిస్తూ కుటుంబాలలో వెలుగులు నింపుతున్నారు.

ప్రభుత్వం అందజేసిన వైఎస్సార్ చేయూత, ఆసరా నగదుతో చిరు వ్యాపారాలు పెట్టుకుని తమ కాళ్ల మీద తాము సగర్వంగా తలెత్తుకుని జీవించగలుగుతున్నారు. సీఎం జగన్ పాలన ఇదే విధంగా మరలా కొనసాగాలని అప్పుడు మరింత వ్యాపారాలు నిర్వహించి అప్పులు బాధ లేకుండా కుటుంబాలకు అండగా నిలుస్తామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



డ్వాక్రా రుణంతో సొంత దుకాణం నడుపుతున్న వంగర మల్లీశ్వరి

టైలరింగ్ దుకాణంతో కుటుంబ పోషణ



గత ప్రభుత్వం డ్వాక్రా రుణమాఫీ పేరుతో మోసం చేసింది. రుణాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో అప్పులు చేయాల్సి వచ్చింది. సీఎంగా జగనన్న అధికారంలోకి వచ్చిన వెంటనే చెప్పిన విధంగా నాలుగు విడతలుగా పొదుపు రుణాలు మాఫీ చేశారు. వైఎస్సార్ ఆసరా ద్వారా వచ్చిన నిధులతో కుట్టుమిషన్ పెట్టుకున్నాను. ఇప్పటి వరకు వైఎస్సార్ ఆసరా ద్వారా వచ్చిన రూ.2.50 లక్షలతో టైలరింగ్ షాప్ పెట్టి నాతో పాటు నలుగురుకి ఉపాధి కల్పించాను. మహిళలకు ఆర్థికంగా భరోసా కల్పిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలంతా అండగా నిలుస్తాము.

ఝాన్సీ, మంగళగిరి.

జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు చెప్పిన విధంగా నాలుగు సార్లు పొదుపు రుణాలు మాఫీ చేశారు. వైఎస్సార్ ఆసరాతో రూ.3.65 లక్షలు రావడంతో చిన్నపాటి దుకాణాన్ని మరింత విస్తరించి వ్యాపారం పెంచుకున్నాము. గతంలో వ్యాపారానికి అప్పులు చేసేవాళ్లం. ఇప్పుడు ఆ అవసరం లేకుండా ప్రభుత్వం అండగా నిలిచింది. ఇంట్లో పెద్దలకు పెన్షన్ వస్తుంది. పిల్లవాడికి అమ్మ ఒడి వస్తుంది. బీటెక్ చదువుతున్న కుమార్తెకు ఫీజు రీయంబర్స్‌మెంట్ వస్తుంది. దీంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా పిల్లలను ఉన్నత చదువులు చదివించ గలుగుతున్నాము.

ఉమాదేవి, మంగళగిరి.

డ్వాక్రా రుణంతో వ్యాపారం అభివృద్ధి

నా పేరు వంగర మల్లీశ్వరి. గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణం. కూలీ నాలీ చేసుకుని బ్రతుకు వెళ్లదీస్తుంటాం. సీఎం జగనన్న చెప్పిన విధంగా డ్వాక్రా రుణమాఫీ చేయడంతో లబ్ధి పొందాను. స్వయం సహాయక గ్రూపు ద్వారా 30 వేల రుణం పొందాను. దీంతో కూల్ డ్రింక్స్ షాపు పెట్టుకున్నాను. నెలవారీ ఆదాయం పెరిగింది. ఇంట్లో ఒకరికి పెన్షన్ వస్తుంది. ప్రభుత్వం అందిస్తున్న ఫీజు రీయంబర్స్‌మెంట్‌తో పిల్లలు చదువుకుంటున్నారు.

వంగర మల్లీశ్వరి, మంగళగిరి

చిరువ్యాపారంతో జీవనోపాధికి మార్గం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే నాలుగు విడతలుగా పొదుపు రుణాలను మాఫీ చేశారు. ప్రభుత్వం మా బ్యాంక్ ఖాతాలో వేసిన వైఎస్సార్ చేయూత, ఆసరా ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఆసరా ద్వారా వచ్చిన డబ్బుతో చిరు వ్యాపారం చేసుకుని సంతోషంగా జీవిస్తున్నాం. జగనన్న రుణం ఎప్పటికీ మరువలేము.

కె లక్ష్మి, మంగళగిరి.

వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే సుచరిత



మేడికొండూరు: మండల పరిధిలోని పొట్లపాడు గ్రామానికి చెందిన పలువురు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. పొట్లపాడు గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయని ఎమ్మెల్యే సుచరిత పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య, ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, గ్రామ సర్పంచ్ కె.శ్రీదేవి సాంబిరెడ్డి, గ్రామపార్టీ అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, చల్లా రోషన్‌రెడ్డి, పేరెడ్డి, అబ్బాస్, సొసైటీ చైర్మన్ పాములపాటి జయరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బాషా, కె.చెన్నయ్య, సుబ్బారెడ్డి, ఉడతా ప్రభాకర్, షేక్ సుభాని, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం శ్రీనగర్ కాలనీలో చోరీ ఘటన చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు మంగళవారం తెలిపిన వివరాల మేరకు శ్రీనగర్ కాలనీలో నివాసముంటున్న కామేశ్వరశర్మ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లారు. గమనించిన దొంగలు మంగళవారం తెల్లవారు జామున కామేశ్వరశర్మ నివాసం తలుపులు పగలగొట్టి బీరువాలో దాచిన రూ.60 వేల విలువైన బంగారు వస్తువులు, వెండి వస్తువులను దోచుకుని పారిపోయారు. మంగళవారం సాయంత్రం కామేశ్వర శర్మ తిరిగి ఇంటికి రాగా తలుపుల తాళాలు పగలకొట్టి ఉండడంతో చోరీ జరిగిందని గమనించి రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా గాంధీజీ వర్ధంతి



విగ్రహానికి నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్ : జాతిపిత మహాత్మాగాంధీ 76వ వర్ధంతి వేడుకలను దుగ్గిరాల గ్రామంలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా రైలుపేట వంతెన సెంటర్ వద్ద గల మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం దుగ్గిరాల మండల అధ్యక్షులు అన్నవరపు సత్యనారాయణ భాస్కర్ గాంధీజీ జీవిత చరిత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వెంకటేశ్వరరావు, చీదెళ్ళ సత్యనారాయణ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గాంధీజీకి ఘన నివాళులు

మంగళగిరి: జాతిపిత మహాత్మాగాంధీ దేశానికి స్వాతంత్రం కోసం చేసిన పోరాటం ఆదర్శనీయమని వైఎస్సార్‌సీపీ నాయకుడు మునగాల మల్లేశ్వరరావు పేర్కొన్నారు. నగరంలోని జాతీయ రహదారి వద్ద గల నియోజకవర్గ ఇన్‌చార్జి గంజి చిరంజీవి కార్యాలయంలో మంగళవారం మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎండీ ఫిరోజ్, నేరెళ్ళ మురళి, బొమ్ము శివరామిరెడ్డి, వల్లంశెట్టి విజయ్, రజక సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, వేమూరి వందనం, బియ్యం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మైదాన ప్రాంత గిరిజనులను తీరని అన్యాయం

తాడేపల్లిరూరల్ : మైదాన ప్రాంత గిరిజనులను రాజ్యసభకు ఎంపిక చేయాలని ఆదివాసీ మేధావుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు అనుముల వంశీకృష్ణ ప్రభుత్వాన్ని మంగళవారం డిమాండ్ చేశారు. ఏపీలో మొత్తం 679 మండలాలు ఉన్నాయని, వాటిలో 635 మండలాల్లో 65 శాతం మంది మైదాన ప్రాంత గిరిజనులు ఉన్నారని చెప్పారు. మిగిలిన 35 శాతం గిరిజన జనాభా కేవలం 44 మండలాల షెడ్యూల్ ప్రాంతాల్లో నివసిస్తున్నారని అన్నారు. షెడ్యూల్ ప్రాంతంలోని 44 మండలల్లో మాత్రమే 7 ఎస్టీ శాసనసభ, ఒక ఎంపీ సీట్లు రిజర్వు చేయబడ్డాయన్నారు. 44 మండలాల గిరిజనులకు మాత్రమే అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యత ఇస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక జనాభా కలిగిన మైదాన ప్రాంత గిరిజనులైన ఎరుకుల, యానాది, చెంచు, నక్కల తదితర తెగలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. ప్రస్తుతం ఖాళీ అయిన 3 రాజ్యసభ సీట్లలో 1 రాజ్యసభ సీటును మైదాన ప్రాంత గిరిజనులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పేదలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు



ఫిరంగిపురం: మండలంలోని అల్లంవారిపాలెం సచివాలయం-2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఫిరంగిపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో రెండో విడత ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వారికి గుంటూరు వైద్యశాలకు రిఫర్ చేశారు. వైద్యాధికారి టి.ఎస్తేరురాణి మాట్లాడుతూ 374 మందికి పరీక్షలు చేసామని చెప్పారు. ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా అన్ని రకాల సేవలు అందుతున్నాయన్నారు. శిబిరంలో వైద్యులు శ్వేత, ప్రత్యేక వైద్యులు చరిష్మా, సౌమ్య, సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

మంగళగిరి: భారత్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మంగళవారం అమర వీరుల దినోత్సవం సందర్భంగా తలసేమియా వ్యాధితో బాధ పడుతున్న చిన్నారులకు రక్తం అందించేందుకు ప్రతి ఏడాది రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. సేకరించిన 60 రక్తం యూనిట్లను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భారత్ సేవా ట్రస్ట్ ప్రతినిధులు ఉజ్జూరి నాగేంద్ర కుమార్, తేలు ఫిరోజ్, గడ్డం యోగేశ్వరరావు, కాట్రు ధనుంజయరావు, కుర్రా రాజా సురేష్, ఉద్దంటి వెంకటేష్, జొన్నాదుల వంశీ పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతపై అవగాహన అవసరం

ప్రసూతి వైద్య నిపుణురాలు చదలవాడ సుధ



తాడేపల్లిరూరల్ : మహిళలు భద్రత, ఆరోగ్యం వంటి అంశాలలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ప్రముఖ స్త్రీ, ప్రసూతి వైద్య నిపుణురాలు, వెంకటేశ్వర ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు చదలవాడ సుధ సూచించారు. మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఏపీ సైన్స్ సిటీ, ఎన్‌సీసీ 10వ ఆంధ్రా బెటాలియన్‌లు సంయుక్తంగా నిర్వహించిన 'బాలికల వాయిస్-2024' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మహిళల భద్రత, పునరుత్పత్తి, ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం, యుక్త వయస్సులోని బాల బాలికల మానసిక కోణాలపై, సాంకేతిక పురోగతిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సుధను కేఎల్‌యూ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త వేణు ప్రియ, బ్లూక్రాస్ సొసైటీ నుంచి డాక్టర్ పద్మప్రియ, ప్రభుత్వ ఆసుపత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.ప్రభావతి, ఎన్‌సిసి 10వ ఆంధ్రా బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్. సుదర్శన్, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి పావని, యూనివర్శిటీ ప్రొ ఛాన్సలర్ డాక్టర్ కె.ఎస్. జగన్నాథరావు, వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రొ వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్. హనుమంతరావు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్య పరిరక్షణ

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

మేడికొండూరు: ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహిస్తుందని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అన్నారు. మండలంలోని జంగంగుంట్లపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఒక్కరికి ఆరోగ్య పరీక్షలు ఇంటి వద్దకే అందించేందుకు వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ వైద్య శిబిరాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి వైద్యులను అందుబాటులో ఉంచి ప్రజలకు ఉచితంగా వైద్యం అందించడం జరుగుతోందన్నారు. ప్రజలకు మేలుచేసే ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనన్నారు. వైద్య శిబిరంలో సుమారు 300 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్, వైస్ ఎంపీపీ భవనం రాజశేఖర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ కల్లి శ్రీదేవి సాంబిరెడ్డి, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు కిషోర్ రెడ్డి, అబ్బాస్, మండల సొసైటీ చైర్మన్ పాములపాటి జయరావు, షేక్ బాజీ, బి.వి.సుబ్బారెడ్డి, ఎంపీడీవో ప్రభాకరరావు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలి

- ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- క్రీడాకారులకు బహుమతులు అందజేత

తాడికొండ: నైపుణ్యం గల గ్రామీణ క్రీడాకారులను గుర్తించి వారిని జాతీయ స్థాయి క్రీడాకారులుగా నిలిపేందుకు ఆడుదాం ఆంధ్రా పోటీలను సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్నట్లు మాజీ హోం మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అన్నారు. తాడికొండ నియోజకవర్గ స్థాయిలో తాడికొండ సత్యసాయి హైస్కూల్‌లో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి మంగళవారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని పత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం గ్రామంలో అండర్ 19 క్రికెట్‌కు నిరుపేద కుటుంబానికి చెందిన రషీద్ అనే యువకుడు ఎంపికయ్యాడన్నారు. కుర్రాడికి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ తరుపున రూ.10 లక్షలు ఇవ్వగా, కుర్రాడి ప్రతిభను తెలుసుకున్న సీఎం వైఎస్.జగన్ రూ.10 లక్షలు సాయం అక్కడికక్కడే అందించారన్నారు. ఉండేందుకు కనీసం స్థలం లేదని అడగగా 500 గజాల స్థలం అందించడంతో పాటు భవిష్యత్తులో ఎస్ఐ ఉద్యోగం ఇస్తానని సీఎం హామీ ఇచ్చారని సుచరిత చెప్పడంతో క్రీడాకారులు హర్షధ్వానాలు చేశారు. క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించడం అనేది గొప్ప ఆశయమని అలాంటి ముఖ్యమంత్రి ఉండటం మన అదృష్టమన్నారు. నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించాలని సూచించారు. ఏపీ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ క్రీడల ద్వారా యువతకు మంచి బంగారు భవిష్యత్తు ఉందని, యువతకు ఉన్నత భవిష్యత్తును అందించేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న కృషి అనిర్వచనీయమన్నారు. అనంతరం నియోజకవర్గ స్థాయిలో విజేతలైన పురుషులు, మహిళా జట్లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోకల సరోజిని, ఎంపీపీ తాళ్ళ భాగ్యలక్ష్మి, యార్డు మాజీ చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, మండల పార్టీ అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి పాల్గొన్నారు.



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న సుచరిత

బీసీ కులగణన సాహసోపేత నిర్ణయం

జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహేష్

మంగళగిరి: బీసీల అభ్యున్నతి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన కులగణన సాహసోపేత నిర్ణయమని గుంటూరు జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పారేపల్లి మహేష్ కొనియాడారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కులగణన చేపట్టిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి బీసీల తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. విద్య, ఉపాధి, రాజకీయ, ఆర్థిక రంగాలలో జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు కేటాయించాలంటే తప్పనిసరిగా కులగణన జరిగితేనే సాధ్యమన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలో ఏ రాష్ట్రంలో అమలు జరగని రీతిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంత్రివర్గంలోనూ, లోక్‌సభ, రాజ్యసభ సీట్ల కేటాయింపులోనూ, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవులలో బీసీలకు 50 శాతానికి పైగా కేటాయించి మిగతా రాష్ట్రాలకు, దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రైవేటు బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కాగితాల స్వాతి గౌడ్, దానా గౌడ్, ఉడతా శ్రీనివాస్, తిరువీధుల కిరణ్, ఆలా శివాజీ, మంద్రు సత్యనారాయణ, ఎనుముల నరసింహారావు, దామర్ల నారాయణ, కాటు ధనుంజయ్, జంజనం వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పారేపల్లి మహేష్

సాధికార యాత్రను విజయవంతం చేయాలి

మంగళగిరి: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గంజి చిరంజీవి ఆధ్వర్యంలో జరుగుతున్న సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలని ఆయన కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. యాత్రలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు అంబేడ్కర్ విగ్రహ సెంటర్‌లో దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆసుపత్రి రోడ్డు నుంచి మెయిన్ బజార్ మీదుగా డిగ్రీ కళాశాల వరకు ర్యాలీ చేరుకుంటుందని వివరించారు.అనంతరం కళాశాల వద్ద బహిరంగ సభ జరుగుతుందని రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు.



సామాజిక సాధికార
బస్సు యాత్ర
గతంలో సామాజిక న్యాయం, రాజ్యాధికారంవంటి మాటలు
పాలకులు గొప్పగా చెప్పుకొనుటకు ఉపయోగపడేవి కాని,
శ్రీ వై.యస్. జగన్ మోహన్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా
ప్రమాణ స్వీకారం చేసిన తరువాత యస్.సి., యస్.టి., బి.సి., మైనార్టీ వర్గాలకు
దేశంలో మరెక్కడ లేని విధంగా సామాజిక న్యాయాన్ని అచరణలో చూపారు.
జగనన్న ప్రభుత్వం నాలుగున్నర యేళ్ళలో చేసిన పథకాల అమలుతో
బడుగు, బలహీన వర్గాలకు సామాజిక సాధికార బస్సు యాత్ర ద్వారా
చేకూరిన లబ్ధిని తెలియజేసేందుకు మన ముందుకు వస్తున్నారు.
ఈ బస్సుయాత్ర దేశ చరిత్రలోనే ఒక సువర్ణ అధ్యాయం...
యాత్ర షెడ్యూలు
నేడు ది. 31-01-2024 బుధవారం మ॥ 3-00 గం॥లకు
మంగళగిరి మిద్దె సెంటర్‌లో జరిగే పాదయాత్రలో
ప్రజలు, అభిమానులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయ ప్రార్థన
సా॥ 5:00 గం॥లకు మంగళగిరి సెంటర్ నందు భారీ బహిరంగ సభ
ఈ బస్సుయాత్ర మరియు బహిరంగ సభలలో యస్.సి., యస్.టి., బి.సి., మైనారిటీ సోదర సోదరీమణులు,
వైయస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయప్రార్థన...
గంజి చిరంజీవి
అధ్యక్షులు : రాష్ట్ర చేనేత విభాగం,
ఆప్కో చైర్మన్,
మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త